



# ఇరాక్‌పై నార్వే ఘన విజయం.. 'వైకింగ్' షోతో దద్దరిల్లిన స్టేడియం..

ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో నార్వే జట్టు ఘన విజయంతో బోణీ కొట్టింది. అమెరికాలోని మసాచుసెట్స్‌లో గల జిల్లెట్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో నార్వే 4-1 తేడాతో ఇరాక్‌పై విజయం సాధించింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ బరిలోకి దిగిన నార్వే జట్టుకు మద్దతుగా తరలివచ్చిన అభిమానులు స్టేడియాన్ని హోరెత్తించారు. నార్వే ఫ్యాన్స్ తమ సాంప్రదాయ "వైకింగ్ రో" ప్రదర్శనతో గ్యాలరీల్లో సందడి చేశారు. వేలాది మంది అభిమానులు ఏకతాళంతో చేతులు పైకెత్తి చప్పట్లు కొడుతూ వైకింగ్ శబ్దాలు చేయడంతో స్టేడియం మొత్తం దద్దరిల్లిపోయింది. ఈ




వినూత్న విన్యాసం ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. మరోవైపు మ్యాచ్‌లో నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ తన వరల్డ్ కప్ అరంగేట్రంలోనే చెలరేగిపోయాడు. 29వ నిమిషంలో మొదటి గోల్ చేసిన హాలాండ్, 43వ నిమిషంలో మరో అద్భుత గోల్‌తో జట్టుకు స్పష్టమైన ఆధిక్యాన్ని అందించాడు. ఇరాక్ తరపున 39వ నిమిషంలో స్టార్ ప్లేయర్ ఐమెన్ హుస్సేన్ పవర్‌ఫుల్ హెడర్‌తో గోల్ కొట్టి స్కోరును 1-1తో సమం చేసి గట్టి పోటీ ఇచ్చాడు. అయితే రెండో అర్ధభాగంలో నార్వే పూర్తి ఆధిపత్యం చెలాయించింది. 76వ నిమిషంలో లియో ఒస్టిగార్డ్ గోల్ చేయగా, మ్యాచ్ ముగిసే సమయానికి ఇరాక్ ప్లేయర్ చేసిన ఓన్ గోల్‌తో నార్వే స్కోరు 4-1కు చేరింది. ఈ విజయంతో నార్వే గ్రూప్-ఎలో శుభారంభం చేసింది. హాలాండ్ ప్రదర్శన, ఫ్యాన్స్ వైకింగ్ రో హైలైట్‌గా నిలిచాయి. 'వైకింగ్' షో లేదా వైకింగ్ రో అంటే.. చేతులు పైకెత్తి ఏకతాళంతో చప్పట్లు కొడుతూ, 'హు!' అని గర్జించే అభిమానుల విన్యాసం. ఆటగాళ్లలో యుద్ధ స్ఫూర్తిని నింపే అద్భుత ప్రదర్శన. ఇది సాధారణంగా నార్వే, ఐస్‌లాండ్ వంటి నార్డిక్ (ఔనీతీటతిఇ) దేశాల ఫుట్‌బాల్ అభిమానులు తమ జట్టును ఉత్సాహపరచడానికి స్టేడియంలో ఈ విన్యాసం చేస్తారు.

# దూసుకొస్తున్న ఫ్రాన్స్ స్ట్రైకర్.. ఫ్లూట్ ఊదిన ఎంబాప్పే

ఈస్ట్ రూథర్‌ఫోర్డ్: ఫిఫా వరల్డ్‌కప్‌లో ఫ్రాన్స్ స్ట్రయికర్ కైలియన్ ఎంబాప్పే తన ట్యాలెంట్ ప్రదర్శించాడు. సెనిగల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనే రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ సాధించిన ఫ్రాన్స్ ప్లేయర్‌గా అతను రికార్డు సృష్టించాడు. సెనిగల్‌తో మ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో ఫ్రాన్స్ విజయం సాధించింది. అయితే ఇప్పటి వరకు వరల్డ్‌కప్‌ల్లో ఎంబాప్పే తన ఖాతాలో 14 గోల్స్ వేసుకున్నాడు. కేవలం మూడో వరల్డ్‌కప్ ఆడుతున్న ఎంబాప్పే తన గోల్స్ స్కోరింగ్‌లో దూసుకొస్తున్నాడు. ఇప్పటి వరకు ప్రపంచ కప్ పోటీల్లో అత్యధిక సంఖ్యలో గోల్స్ చేసిన ప్లేయర్లలో క్లోస్, మెస్సీ ఉన్నారు. ఆ ఇద్దరు ప్లేయర్లు వ్యక్తిగతంగా వరల్డ్‌కప్ టోర్నీల్లో 16 గోల్స్ చేశారు. దేశం కోసం చరిత్ర సృష్టిస్తానని, తమ జట్టు వరల్డ్‌కప్ గెలిచేందుకు ఆడుతానని ఎంబాప్పే అన్నాడు. సెనిగల్‌తో మ్యాచ్‌లో ఎంబాప్పే 66వ నిమిషంలో తొలి గోల్ చేశాడు. అయితే సెనిగల్ గోల్‌కీపర్ మెండీ ఆరంభంలో ధీటుగా ఫ్రాన్స్ స్ట్రయికర్లను అడ్డుకున్నాడు. తొలి గోల్ చేసిన తర్వాత కెప్టెన్ ఎంబాప్పే అరుదైన రీతిలో దాన్ని సెలబ్రేట్ చేసుకున్నాడు. గోల్ కొట్టిన తర్వాత ఫ్లూట్ ఊదాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఎంబాప్పే ఫ్లూట్ వాయించాడు. ఆ సమయంలో మాట్లాడుతూ ఒకవేళ ఆఫ్రికాపై గోల్ కొడితే, అప్పుడు పిల్లనిగ్రోవిని వాయిస్తానని చెప్పాడు. దాని ప్రకారమే గోల్ కొట్టిన తర్వాత ఎంబాప్పే వేణువును ఊదుతున్నట్లుగా సంకేతం ఇచ్చాడు. ఇక మళ్లీ 96వ నిమిషంలో రెండో గోల్ చేశాడు. ఇప్పటి వరకు ఎంబాప్పే వరల్డ్‌కప్ గోల్స్ సంఖ్య 14కు చేరుకున్నది. దీంతో ఆ దేశ ప్లేయర్ గెర్డ్ ముల్లర్




సరసన అతను చేరాడు. బ్రెజిల్ స్టార్ రోనాల్డో ఖాతాలో 15 వరల్డ్‌కప్ గోల్స్ ఉన్నాయి. 2018లో ఫ్రాన్స్ వరల్డ్‌కప్ గెలవడంలో ఎంబాప్పే కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత 2022లోనూ ఆ జట్టు ఫైనల్ చేరేందుకు హెల్ప్ చేశాడు. ఇప్పుడు ఫ్రాన్స్‌ను మరోసారి ముందుండి నడిపిస్తున్నాడు.

# వైభవ్‌కు లైఫ్‌లైన్.. థర్డ్ అంపైర్ నిర్ణయంపై దుమారం!



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లో నిలిచాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో దంబుల్లా వేదికగా భారత్-ఎ, అఫ్గానిస్థాన్-ఎ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ జట్టు 9 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. అయితే వైభవ్ విషయంలో థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. షామ్స్ బౌలింగ్‌లో వైభవ్ ఇచ్చిన క్యాచ్‌ను ఫరూదాన్ అద్భుతంగా అందుకున్నాడు. కానీ థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో వివాదం రాజుకుంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే షామ్స్ బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ ఇచ్చిన క్యాచ్‌ను ఫరూదాన్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. వైభవ్ సహా అఫ్గాన్ ప్లేయర్లు కూడా క్లియర్ క్యాచ్ అని అనుకున్నారు. వైభవ్ పెవిలియన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. కానీ రీప్లేలో థర్డ్ అంపైర్ చెక్ చేసి బంతి కాస్త నేలను తాకినట్లు అనిపించిందని నాటౌట్‌గా ప్రకటించాడు. ఈ నిర్ణయంపై అఫ్గాన్ ఆటగాళ్లు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు. మైదానంలో ఉన్న అంపైర్లతో వాగ్వాదానికి దిగుతూ వివరణ కోరారు. థర్డ్ అంపైర్ నిర్ణయంతో వైభవ్ డకౌట్ అయ్యే ప్రమాదం నుంచి బయట పడ్డాడు. అయితే ఈ అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. రీప్లేలో క్యాచ్ క్లియర్‌గా కనిపించిందని.. థర్డ్ అంపైర్ సరైన నిర్ణయాలు తీసుకోవడం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. థర్డ్ అంపైర్ నిర్ణయంతో వైభవ్ డకౌట్ అయ్యే ప్రమాదం నుంచి బయట పడ్డాడు. ఆ తర్వాత కూడా అతడికి మరో అవకాశం లభించింది. అయినప్పటికీ వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 38 పరుగుల వద్ద ఫరూదాన్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయి ఔటయ్యాడు. కవర్ పాయింట్‌లో ఖలీద్ సులభంగా క్యాచ్ అందుకున్నాడు. కాగా, గత మ్యాచ్‌లో శ్రీలంక-ఎ ఆటగాడిని వైభవ్ తోసిసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు థర్డ్ అంపైర్ నిర్ణయ వివాదం కారణంగా వైభవ్ మరోసారి వార్తల్లో నిలవడం గమనార్హం.

# కన్నీరు పెట్టుకున్న అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ

స్పోర్ట్స్ డెస్క్: ఫిఫా ప్రపంచకప్ 2026లో అర్జెంటీనా బోణీ కొట్టిన సంగతి తెలిసిందే. గ్రూప్-జెలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 3-0తో అల్జీరియాపై అర్జెంటీనా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్, స్టార్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ హ్యాట్రిక్ గోల్స్‌తో ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా సొంతం చేసుకున్నాడు. అయితే మొదటి గోల్ కొట్టిన సందర్భంలో మెస్సీ కన్నీరు పెట్టుకున్నాడు. అందుకు గల కారణాన్ని మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. తాను క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నానని, గోల్ కొట్టిన సంతోషంలో ఒక్కసారిగా ఏడుపు వచ్చేసిందని తెలిపాడు. అయితే తన భావోద్వేగంతో మ్యాచ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నాడు. మెస్సీ మాట్లాడుతూ..'మ్యాచ్‌లో నా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నాను. ఫిఫా ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ గోల్స్



చేస్తానని ఊహించలేదు. మ్యాచ్ సమయంలో నా సహచరులు అండగా నిలిచారు. సరైన సమయంలో పాస్‌లు అందించి గోల్స్ చేయడంలో వారు నాకు సహకరించారు' అని మెస్సీ అన్నాడు.'ఈ విజయం నా ఒక్కడిది ఎంతమాత్రం కాదు. జట్టు మొత్తం చేసిన కృషి ఫలితమే ఈ విజయం. తదుపరి మ్యాచ్‌ల్లోనే ఇదే ప్రదర్శనను పునరావృతం చేయాలని ఆశిస్తున్నాను. నేను రికార్డుల గురించి పట్టించుకోను. ఇవాళ నేను రికార్డు సృష్టించాను..


# అఫ్గాన్‌పై సూపర్ సెంచరీ.. ఇషాన్ కిషన్ అరుదైన ఘనత




లఖ్‌నవూ వేదికగా భారత్-అఫ్గానిస్థాన్ జట్లు రెండో వన్డేలో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కి దిగిన టీమిండియా ప్లేయర్లు.. విధ్వంసం సృష్టిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. 79 బంతుల్లో ఏకంగా 125 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 14 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడికి ఇది రెండో వన్డే సెంచరీ కావడం విశేషం. ఈ క్రమంలో ఇషాన్ తన వన్డే కెరీర్‌లో 1000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఇషాన్ కిషన్ ఈ వెయ్యి పరుగుల మైలురాయిని కేవలం 26 ఇన్నింగ్స్‌లోనే చేరుకున్నాడు. దీంతో భారత్ తరపున అత్యంత వేగంగా వెయ్యి వన్డే పరుగులు పూర్తి చేసిన ప్లేయర్ల జాబితాలో అతడు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(19 ఇన్నింగ్స్) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా విరాట్ కోహ్లీ, శిఖర్ ధావన్(24 ఇన్నింగ్స్) రెండో స్థానంలో, నవ్‌జ్యోత్ సింగ్, శ్రేయస్ అయ్యర్(25 ఇన్నింగ్స్) మూడో స్థానంలో ఉన్నారు. 71 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్న ఇషాన్ కిషన్.. తన ఖాతాలో మరో రికార్డు కూడా వేసుకున్నాడు. వన్డేల్లో అఫ్గాన్‌పై ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో భారత ప్లేయర్‌గా ఇషాన్ నిలిచాడు. అతడి కంటే ముందు స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఉన్నాడు. 2023లో 63 బంతుల్లోనే రోహిత్ శర్మ శతక్కొట్టాడు. కాగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 77 బంతుల్లో సెంచరీ చేసి.. ఈ జాబితాలో మూడో భారత ప్లేయర్‌గా నిలిచాడు.

# ఫిఫా ప్రపంచ కప్: ఆస్ట్రియా చారిత్రక విజయం

ఫిఫా ప్రపంచ కప్ 2026లో ఆస్ట్రియా జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. జోర్డాన్ జట్టుపై 3-1 తేడాతో గెలిచింది. దీంతో 36 ఏళ్ల తర్వాత ప్రపంచ కప్‌లో గెలుపు రుచి చూసింది. ఆఖరిసారిగా 1990 ప్రపంచ కప్‌లో ఆస్ట్రియా.. యునైటెడ్ స్టేట్స్‌పై విజయాన్ని అందుకుంది. కాగా ఆరంభం నుంచి ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో.. ఆస్ట్రియా జట్టు జోర్డాన్‌పై పై చేయి సాధించింది. ఈ మ్యాచ్ 20వ నిమిషంలో ఆస్ట్రియా ఆధిక్యంలోకి వెళ్లింది. అద్భుతమైన జట్టు సమన్వయంతో సాగిన గేమ్‌ను రొమానో ష్మిడ్ గోల్‌గా మలిచాడు. జేవర్ ష్లాగర్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న అతడు బాక్స్ అంచు నుంచి కొట్టిన షాట్ నేరుగా గోల్‌పోస్ట్ ఎగువ మూలలోకి దూసుకెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో జోర్డాన్ గట్టిగా పోరాడింది. 50వ నిమిషంలో అలీ ఓల్వాన్ వేగవంతమైన కౌంటర్ అటాక్‌ను గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ మరింత రసవత్తరంగా మారింది. 76వ నిమిషంలో మ్యాచ్ మలుపు తిరిగింది. కార్నర్ కిక్ సందర్భంగా వచ్చిన బంతిని క్లియర్ చేసే ప్రయత్నంలో జోర్డాన్ డిఫెండర్ యజాన్ అరబ్ పొరపాటున తన



గోల్‌పోస్ట్‌లోకే మళ్లించాడు. దీంతో ఆస్ట్రియా 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. అంతకుముందు 90వ నిమిషంలో సీనియర్ స్ట్రైకర్ మార్కో అర్నాటోవిక్ చేసిన గోల్‌ను వీడియో అసిస్టెంట్ రిఫరీ (ఎంఫీ) సమీక్ష అనంతరం హ్యాండ్‌బాల్ కారణంగా రద్దు చేశారు. అయితే అదనపు సమయంలో అతడు పెనాల్టీని గోల్‌గా మలిచి ఆస్ట్రియా విజయాన్ని ఖాయం చేశాడు. మ్యాచ్ అనంతరం ఆస్ట్రియా కోచ్ రాల్ఫ్ రాంగ్నిక్ మాట్లాడారు. 'ఇది అత్యంత కఠినమైన పోరు. జోర్డాన్ అద్భుతంగా పోరాడింది. మేం గెలిచాం కానీ ఈ విజయం అంత సులభంగా రాలేదు' అని తెలిపాడు. ఆస్ట్రియా తన తొలి మ్యాచ్‌లో మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా జట్టుతో జూన్ 22న తలపడనుంది.

# సెంచరీలతో చెలరేగిన శుభమన్ గిల్, ఇషాన్ కిషన్..భారీ స్కోర్ దిశగా భారత్

లక్నో: ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న రెండో వన్డేలో ఇండియన్ బ్యాటర్లు దుమ్మురేపుతున్నారు. కెప్టెన్ శుభమన్ గిల్, ఇషాన్ కిషన్ సెంచరీలతో చెలరేగారు. ఆ ఇద్దరూ ఆఫ్ఘన్ బౌలర్లతో దంచి కొడుతున్నారు. వన్డేల్లో గిల్ 9వ సెంచరీ నమోదు చేయగా, ఇషాన్ కిషన్ రెండో సెంచరీ చేశాడు. ఆ ఇద్దరు బ్యాటర్లు ఓకే ఓవర్‌లో సెంచరీలు కొట్టడం విశేషం. గిల్ సెంచరీలో 12 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. ఇక ఇషాన్ ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఇషాన్ కిషన్ 71 బంతుల్లో, గిల్ 77 బంతుల్లో సెంచరీలు చేశారు. ఇషాన్ కిషన్ 52 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి ఆ తర్వాత వేగాన్ని పెంచాడు. ఆ తర్వాత కేవలం 19 బంతుల్లోనే 50 రెండో ఫిఫ్టీ పూర్తి చేశాడు. తాజా సమాచారం ప్రకారం 36 ఓవర్లలో ఇండియా రెండు వికెట్ల నష్టానికి 307 రన్స్ చేసింది.



